"అమ్మా" గావుకేక పెట్టాడు.

"నా చేతులు నరికినా బాధపడనమ్మా. కానీ నా తల్లెమ్మ జోలికి వొచ్చిన యెదవల్ని శాతగానోడిలా యిడిచిపుచ్చమనటం దరమ మేనామ్మా!"

"నా మాటంటే మాటే." అనేసి ఇల్లు చేరింది యమున. గంగులికి కోపం వచ్చినా మింగి కాస్సేపు కూర్చుని శ్యాంని వాళ్ళింటి దగ్గర దించేసి వెళ్ళిపోయాడు. కానీ వాడి మనస్సు భగ్గున మండుతూనే వుంది. అయినా యమున మాటని కాదనలేక కూర్చుండి పోయాడు.

## 4

ఈ విషయం వూరంతకీ తెల్సిపోయింది. రాజమ్మ నెత్తీనోరూ కొట్టుకుంది "నీ చదువులు మండిపోనూ!" అని. యమున రెండు రోజులు కాలేజీకి వెళ్లలేదు. కానీ వూళ్ళో వసంత ఇంటికి వెళ్లాలన్నాసరే చేతిలో ఈతచువ్వ వదలటంలేదు. ఈతచువ్వ వూగిస్తూ నడిచే యమునని చూసి కొందరు పేర్లు చాలానే పెట్టారు. "రాణీ రుద్రమ్మ, నాయకురాలు నాగమ్మ అనీ, ఝాన్సీ లక్ష్మీబాయి అనీ, కాదు, ఆదిశక్తి మహంకాళి అనీ" ఇలా విన్పించీ విన్పించకుండా అంటూనే వుండే వాళ్లు.

యమునకి పరీక్షలు దగ్గరపడ్డాయి. రాజమ్మ 'వద్దే' అన్నా రెండేళ్ళ చదువు గంగలో కలపటం యెందుకూ అని ధైర్యంగా కాలేజీకి వెళ్ళి పరీక్షలు రాసింది. కానీ యమున వెనక గంగులు దుడ్డుకర్ర భుజాన పెట్టుకుని వుంటూనే వుండేవాడు. ఆ అమ్మాయి పరీక్ష పేపరు రాసేవరకూ యే చెట్టుకిందో వచ్చేపోయే జనాన్ని చూస్తూ కాలం గడిపి ఆపైన యమున వెంటవచ్చే గంగులికి నమ్మినబంటు అనీ, 'మారుతి' అనీ పేర్లు స్థిరపడిపోయాయి. వసంత పరీక్షలు రాయకుండానే చదువు ఆపేసింది. సుందరం పరీక్షలు రాయలేదు. మళ్ళీ యమునకి కన్పించలేదు కూడా.

పరీక్షలు కాగానే రాజమ్మ అన్నగారింటి మేనకోడలి పెళ్ళికి వెడుతూ యముననీ తీసుకు వెళ్ళింది. ఆ పెళ్ళికే వచ్చిన వినయ్ దూరపు చుట్టం. అదీకాక యమునకి బావ వరుస అవటంతో అబ్బాయి ఎం.ఏ. పాసైనాడు మంచి వుద్యోగం చేస్తూన్నాడని తెల్సుకుని యమున కోసం చూసింది.

వినయ్ ఆ పెళ్ళిలో యమునని గమనిస్తూనే వున్నాడు.

